# మర్యాదస్థుడు

## 1

సుబ్బన్నగారు వాకిట్లో కుర్చీలో కూర్చుని పెద్ద ఉత్తరాది పొగాకుచుట్ట వెలిగించి కాల్చుతున్నాడు. ఏదో తీవ్రమైన ఆలోచనలో మునిగివున్నాడాయన. చిరుచీకట్లు కమ్ముకుంటున్నవి. ఆయన ఆలోచనలు చప్పున తెగిపోయినాయి. వసారా దిగువున ఆ సందులోకి అతికష్టంమీద మెల్లిగావొచ్చి ఆగింది గుర్రపు బండి; కాస్త మసకబడితే దూరపుదృష్టి బాగా ఆనని కారణంవల్ల సుబ్బన్నగారు, ఆవేళటప్పుడు తనకోసం వొచ్చేవాళ్లెవరా అని ఊహించటానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతలోకే ఆయన పెద్దకూతురు ఊర్మిళ లాంతర్ వెలిగించి పట్టుకొచ్చి వసారాకున్న తీగెకి వేళ్లాడేసి పోయింది.

గుర్రబ్బండినించి టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ సదాశివరావుగారు దిగి గంభీరంగా అడుగులేస్తూ రెండు మెట్లెక్కి ''ఏం సుబ్బన్నగారు, వంట్లో కులాసా!'' అంటూ అటూ ఇటూ చూశాడు ఎక్కడైనా కూర్చోటానికి ఏదైనా వుందా అని.

సుబ్బన్నగారు '' ఓహో....హో! ఇన్స్పెక్టర్ గారా, అలా కూర్చోండి'' అన్నారు చాలా గౌరవపురస్సరంగా. సుబ్బన్నగారి తెల్లగా నెరిసినగిరజాలు - ఇంకా అంతబాగా నెరవని మెలితిరిగిన మీసాలూ విశాలమైన నుదురూ మెరిసేకళ్ళూ, ఆయన వయోధికత్వాన్ని - దృఢత్వాన్ని వ్యక్తంచేస్తాయి. ఆయన ''అమ్మాయి! ఇంకో కుర్చీ తెచ్చి ఇలావెయ్యమని చెప్పు నాగన్నతోటీ!'' అని కేకవేశారు.

వెంటనే ఇంకోకుర్చీని తెచ్చి నాగన్న అన్న పనివాడు వసారాలో వేసివెళ్ళాడు. ఇన్స్పెక్టర్ గారు, ''మీతో కాస్త ఆంతరంగికంగా మాట్లాడాలని వచ్చాను. ఇక్కడ మాట్లాడవచ్చా, లోపలికి పోదామా!'' అని ప్రశ్నిస్తూ కూర్చున్నాడు.

సుబ్బన్న గార్కి ఇన్స్పెక్టర్ రాకకైన కారణం మెరుపల్లే స్ఫురించింది; అయితే అలా తన కావిషయం తెలిసినట్టుగా ఏభావాన్ని ప్రదర్శించకుండా, ''మీకు అభ్యంతరమైతే లోపలికే వెళ్దాం'' అన్నారు.

ఇద్దరూ లోపలికెళ్లారు. మేడ లోపలి భాగంలో ఓ గదిలోకెళ్ళి కూర్చున్నారిద్దరూ.

''సుబ్బన్నగారూ మొహమాటం లేకుండా అడుగుతున్నా ననుకోండి. ఇది నావిధి. ఆటీన్ సోమన్న ఎక్కడ దొరుకుతాడో మీరే చెప్పాలి!'' అన్నాడు ఇన్స్పెక్టర్ గారు చాలా మెత్తగా.

సుబ్బన్న గారి మసకబారిన కళ్లల్లో కాంతి మెరిసింది, గదిలోని లాంతర్ వెలుగులో. ''సోమన్న

ఎక్కడ వుంటాడో నాకెలా తెలుస్తుంది! అయినా ఇప్పుడేం అంత అవసరం వొచ్చింది వాడితోటి?'' అని అడిగారాయన.

గదిబైట ఎవరూ తమ సంభాషణని రహస్యంగా వినడం లేదని స్థిరపరుచుకోడం కోసం ఇన్స్పెక్టర్ గారు ఒకసారి వాకిట్లోకి తొంగిచూసి ''మీకు తెలియకపోవడం అంటే నమ్మశక్యం కాదు. మీరూ సోమన్న పరిచితులని అందరికీ తెలుసును ఆ పైసంగతులన్నీ నేను చెప్పేదేముంది? సోమన్న మీద పోలీసుశాఖ హత్యానేరం మోపి అతనికోసం తిరుగుతున్నారు. మీకేమైనా తెలుసుననీ, న్యాయం జరగటానికి తోడ్పడతారని అనుకుంటూ నేను ఇక్కడికివచ్చాను!'' అన్నాడు ఇన్స్పెక్టర్గారు.

సుబ్బన్నగారు రెండునిముషాలు ఇన్స్పెక్టర్ వంక చూస్తూ కూర్చున్నారు. ఆ తర్వాత మాటలు పెగిలి బైటికివచ్చాయి. ''హత్యానేరమా! ఏంహత్య - ఏంకథ!'' అని ప్రశ్నించాడు కొంచెం వొణుకుతున్న గొంతుకతోటి. అయితే ఈ సందిగ్ధత ఒక క్షణం మాత్రమే. తిరిగీ ఆయన యథాప్రకారపు గాంభీర్యంతోటి ఇన్స్పెక్టర్గారి జవాబుకై నిరీక్షించసాగారు.

ఇన్స్పెక్టర్ ''మెరకవీధిలో అతని ఉంపుడుగత్తెని చంపేసి వెళ్లాడు నిన్నరాత్రి! చాలా ఘోరమైన సంఘటన; బరిశెపెట్టి ఇటునుంచి అటుదిగేట్లు పొడిచి చంపేశాడు... వాడే పొడిచాడనేది స్పష్టం. వాడి ఉంపుడుగత్తె తల్లి చూస్తూవుండగానే జరిగింది... మీరు కాస్త వాడిజాడ మాకు చెప్పాలి సుబ్బన్నగారు. ''సోమన్న తోటి పరిచయం వుంది నిజమేగాని అతని నివాసం ఎక్కడో ఏమిటో నా కెలాగ తెలుస్తుందండి?'' అన్నాడు నిర్లిప్తంగా.

ఇన్స్పెక్టర్గారు, '' మీకేమీ తెలీయదనే అంటారా! అయితే నేనిక్కడికి రావడం వ్యర్థమే!'' అంటూ లేచాడు.

''క్షమించండి ఇన్స్పెక్టర్గారూ! నాకేమీ తెలియదండి'' అన్నారు సుబ్బన్నగారు ఇన్స్పెక్టర్గార్ని వాకిలిదాకా వొచ్చి వొదిలిపెట్టి. జట్కా సాగిపోయింది గతుకుల రోడ్డుమీద.

లోపలికి వచ్చిన సుబ్బన్నగారు ముందు గదిలో మంచంమీద కూలబడ్డారు. ఆయన భార్య లోపల్నించి ఆదుర్దాగా వొచ్చి '' ఇన్స్పెక్టర్గారేమన్నా రేమిటండి?'' అని ప్రశ్నించింది.

సుబ్బన్నగారు, చాలా చిరాకుగా, ''పోనీవే వెధవగోల! ఆటీన్ సోమన్న ఉంపుడుగత్తెను ఖూనీ చేసాట్ట. పోలీసువారు నన్నడగడానికి వచ్చారు, వాడెక్కడ దొరుకుతాడా అని! బాగోలే? నాకేం తెలియదని పంపించేశాను!'' అన్నారు.

ఆయన పెద్దకూతురూ, చిన్న కూతురూ, భార్యా ఇకనేమీ మాట్లాడకుండా ఉండిపోయినారు. లాంతర్ వెలుగు ప్రసరించని మూలలవైపు చూస్తూ ఆలోచనలలో పడిపోయినారు సుబ్బన్నగారు.

## 2

ఆటీన్ సోమన్న అంటే ఆరోజుల్లో రాజమండ్రి పట్నం లోనూ చుట్టుపక్కల గూడా అందరికీ

హడలే. ఈ భయం నివారించడానికి పోలీసులు సోమన్నని జైల్లో పెట్టాలని అనేక తడవలు ప్రయత్నించారుగాని - అతని మీద ఏ నేరమూ రుజూ కాకపోవడంతోటి ఏమిన్నీ చెయ్యలేకపోయినారు. సోమన్న ఎక్కణ్ణించి వొచ్చాడో ఎవరికీ తెలియదు. ఎప్పుడూ గ్లాస్కో మల్లుపంచె కట్టి, అరిచేతులదాకా పెద్దాపురం సిల్కు తొడిగి, టర్కీ టవల్ తలకు చుట్టాడు. భారీమనిషి; ఎర్రవాగైన కళ్ళు, చామనచాయ, కోరమీసాలు నిగనిగలాడుతూ మొహానికెంతో గాంభీర్యాన్నిస్తాయి.

సోమన్న చీట్లపేకలో ఘటికుడు. ఒకప్పుడు, అతను ఆటీన్ తురుపుముక్కతోటి ప్రత్యర్థుల్ని చిత్తుగా ఓడించి వున్నాడు. అప్పణ్ణించే అతనికి ఆటీన్ సోమన్న అనే పేరు స్థిరపడిందని ఆ చుట్టుపక్కల చెప్పుకుంటారు. సోమన్న రాజమండ్రి పరిసరాల్లో రహస్యంగా చీట్లపేకలాడే ప్రదేశాల్లోకి వెళ్ళి చీట్లాడే జీవనం చేస్తూ వుండేవాడు అతను ఆ ప్రాంతాలకొచ్చిన కొత్తల్లో. కొద్దిరోజుల్లోనే అతడు దొంగతనాలు చేస్తున్నాడనీ, భయస్తుల్ని - ఏం? ధైర్యస్థుల్ని సైతం బెదిరించి డబ్బులు గుంజుతున్నాడని వదంతులు వ్యాపించాయి. వీట్ని వదంతులుగానే భావించారందరూ. వేటినీ రుజూ చేసుకోలేకపోయినారు పోలీసులు.

మొత్తం మీద సోమన్న అంటే అందరికీ లోలోపల ఒక బెదురు స్థిరపడిపోయింది. కొన్ని సంఘటనలవల్ల సోమన్న ధైర్యసాహసాలు ప్రజలకి తెలియడంతోటి ఈ బెదురు పెరిగింది. గోదావరి ఉధృతమైన వరదలో ప్రమాదవశాత్తు పడిపోయిన ఐదేళ్ళ పిల్లని అతడు ప్రాణానికి తెగించి గోదావరిలోకి దూకి రక్షించి వొడ్డు వేశాడు; ఆ నిమిషాన గోదావరిలోకి దూకడానికి గజ ఈతగాళ్ళు సైతం వెనకంజవేస్తారు.

ఒకసారి చీట్లపేక తగాదాలో తనమీదికి వొచ్చిన ముగ్గురు ప్రత్యర్థుల్ని గుండపిండిగా కొట్టాడతను; అప్పణ్ణించీ అతనంటే ఊళ్లోనే కాకుండా, 'రౌడీ' లన తగ్గవారు గూడా జంకి మర్యాదగా ప్రవర్తించసాగారు.

అటువంటప్పుడే ఒక చిత్రమైన సంఘటన జరిగింది. రాజమండ్రిలోనే ఆర్యాపురం ప్రాంతంలో ఒక ఇరుకు సందులో పోలీసుల కభేద్యంగా వుంటూవచ్చిన ఒక చీట్లపేకలాట కేంద్రం వుంది; అది పెంకుటిల్లు, ఇంట్లోనే చెక్కలతోటి అటకలాగా ఒక అంతస్తు కట్టి, దానికి నిచ్చెన వేశారు; నిచ్చెన మెట్లెక్కి పైకివెళ్తే విశాలమైన గది వుంటుంది. ఈ గదిలో - నెలకు పది రోజులు జోరుగా చీట్లపేక సాగుతూవుంటుంది. చుట్టుపక్కల పెద్ద పెద్దవారే ఇక్కడ పొగై వేలకొలదీ డబ్బు పణం పెట్టి చీట్లాడుతారు.

ఆ పెంకుటిల్లు పైనించి చూడడానికి చాలా నిరపాయకరమైనదీ, పాతబడ్డ కొంపానూ. దానిలో చిన్న హోటలున్నది. ఒక నాడు సాయంత్రం వేళ; కిందహోటల్లో సామాన్యులు కూర్చుని కాఫీలు తాగుతున్నారు. పైన అప్పుడే ఆట మొదలెట్టారు. ఈతాకుల చాపపరిచి దానిమీద ఏడెనిమిదిమంది కూచున్నారు; అందరూ బాగా డబ్బులు వుండి వేరే పనిపాటలు లేని రకం; చేతులకి ఉంగరాలు మెరుస్తున్నాయి. జరీఅంచు కండవాలూ సిల్కు పంచెలూ వొంటిమీంచి జారిపోతున్నాయి. కత్తెరమార్కు సిగరెట్లు పొగతోటి వాతావరణం వూపిరాడకుండా వుంది. వాళ్ళ తలలమీద పెద్ద లస్టర్

లైటు వెలుగుతోంది. ఈ సమాజంలో సుబ్బన్నగారూ వున్నారు. ఆయనగారుగూడా అప్పుడప్పుడు వొచ్చి చీట్లాడ్డం కద్దు.

చీట్లాటకు ఇంకో చెయ్యి తక్కువ. అత నింకా రాలేదేమని మిగతా ఆటగాళ్లు ఎదురుచూస్తున్నారు. అంతక్రితం, ఆటీన్ సోమన్న అంటే ఎవరో చూడనివాళ్ళూ, అతనంటే గొప్పగా చిత్రించుకుని అతన్ని చూడాలని అభిలాష మిక్కుటంగా గల వాళ్ళూ అక్కడ ఐదారుగురున్నారు. అందులో సుబ్బన్నగారొకరు. ఆయన, తనపక్కన కూచున్న ఒకాయనతోటి, '' ఏమండి సింహాచలం గారు, సోమన్న ఎప్పటికొస్తాడు!'' అని ప్రశ్నించారు;

సింహాచలం, '' ఈపాటికి వస్తూనేవుండాలి. అతనులేంది ఆటవుషారుగా వుండదు!'' అన్నాడు.

ఏడు గంటలు దాటాక ఆటీన్ సోమన్న వొచ్చాడు పైకి అతను అందర్నీ ఒకసారి కలయజూశాడు; సుబ్బన్న గార్ని చూసినప్పుడెందుకో అతని నొసట ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం కన్పించాయి. అయితే వీటిని బలవంతంగా అణిచేసుకుని ఆటలోకొచ్చి కూర్చున్నాడతను.

అతన్నదివరకే చూడాలని అభిలాషగలవారు, గొప్పహీరోను చూసినట్టు చూశారు. సుబ్బన్నగారు ఒకటి రెండు నిమిషాలు అతన్ని రెప్పవాల్చకండా చూశారు; తర్వాత సాఫీగా ఆటలో నిమగ్నమైపోయినారు. అరగంటసేపు ఇలాగే సాగింది ఆట మౌనంగా.

ఆ తర్వాత డబ్బులు ఎవరెవరివ్వాలో, ఎవరెవరు పుచ్చుకోవాలో అదే పంపిణీ వ్యవహారం జరిగింది. ఈ ఆటలో సోమన్న కాట్టే లాభం కన్పించలేదు, సుబ్బన్నగారు కొద్దిగాగెలుచుకున్నారుగూడా. సోమన్న రెండో ఆటకు ఉషారుగా వున్నాడు. డబ్బులు ప్రతి ఆటగాని ఎదట చిన్న చిన్న కుప్పలుగా పోసుకుని కూర్చున్నారు. నిజానికి అక్కడ ఆడేవాళ్లు దేనికోసం ఆడుతున్నారో దాన్నే అతి నిర్లక్ష్యంగా కాళ్ళకిందకి తోసి - ఆడుతున్నారు. ప్రతివారి పక్కన సిగరెట్ పీకలగుట్ట ఒకటీ నిప్పుల్లల పోగు ఒకటీ తయారౌతోంది.

రెండో ఆట ముగిసేవరకూ 9 గంటలయింది. ఆటచివర సోమన్న అకస్మాత్తుగా మహోగ్రుడై లేచి తన ప్రత్యర్థి ఒకాయన మీద విరుచుకుబడ్డాడు. ఆట అకస్మాత్తుగా ఆగిపోయి మరునిమిషం ఆ చెక్కల గది రణరంగం అయింది. '' ఏమిటి? ఏమిటి?'' అని అందరూ కలసి వాళ్ళిద్దర్నీ విడదియ్యడానికి ప్రయత్నించారు. సుబ్బన్నగారు ఏమీ మాట్లాడకుండా ఒకపక్క గోడకానుకుని ఈ ద్వంద్వ యుద్ధాన్ని పరికిస్తూ నిలబడివున్నారు.

సోమన్న తనతోటి సమబలుడైన తన ప్రత్యర్థిని కిందపడేసి తల చెక్క కూర్పుకేసి బలంగా బాదుతున్నాడు. ఇలాగే ఇంకో పదినిమిషాలు సాగితే ఎలావుండేదో... మిగతా సభ్యులందరూ నిశ్చేష్టులై నిలబడివున్నారు ఏమీతోచక, ఏమిటో అర్థంకాక.

ఈ సమయాన, సుబ్బన్నగారు ఆకస్మాత్తుగా తాను నుల్చున్న చోటినించి గబగబ రెండడుగులు ముందుకువేసి, సోమన్న చొక్కాని మెడదగ్గిర పట్టుకుని బలవంతంగా పైకి లేపి నుల్చోపెట్టారు; ఆయన

మొహం మాత్రం ఏమీ మార్పుచెందలేదు. ''సోమన్న గారు! దయచేసి ఈ ద్వంద్వయుద్ధం మానేసి ఏం జరిగిందో మాకే చెప్పండి!'' అన్నారు.

సోమన్న ఒక్కసారి బెబ్బులి లాగా హుంకరించాడు; కాని సుబ్బన్నగారి వేపొకసారి తేరపారిచూసి చప్పున ఉద్రేకం తగ్గించేసుకున్నాడు; తిరిగి తన కాళ్ళకింద లేవటానికి ప్రయత్నించుచున్న ప్రత్యర్థివేపు అసహ్యంగా చూస్తూ, ''దొంగవెధవ, దొంగముక్క జేబులో పెట్టుకొస్తాడా పెద్ద ఆటకి! మీరు అడ్డం రాకపోతే ప్రాణం తీసేవాణ్ణి!'' అన్నాడు. అతని మాటల్లో అసహ్యమే ధ్వనించిందిగాని మొదట్లోవున్న కోపావేశం ఉద్రేకం లేవు.

అక్కడ సమావేశమైనవాళ్లకి సోమన్న యుద్ధం విరమించినందుకూ ఆశ్చర్యం కలగలేదు; ప్రత్యర్థి దొంగముక్క తోటి ఆట ఆడినందుకూ కోపం రాలేదు. ఊరంతా గజగజలాడే సోమన్నని - సుబ్బన్నగారు పిల్లిని పట్టుకున్నట్టు పట్టుకుని లేవదీసి అతన్ని ఒక క్షణంలో లొంగదీశాడేమిటి! అందులోనూ వెనకాముందు పరిచయమైనా లేని వ్యక్తిని! అని ఆశ్చర్యం వేసింది వాళ్ళకు.

ఆవేళటకి ఆట విరమించారు వాళ్లు. దెబ్బతిన్న వాడిదగ్గిర ఒక ఇస్పేటు ఆసుముక్క దొరికింది. అతన్ని అంతటితో వదిలేశారు. వెళ్ళేప్పుడు, సుబ్బన్నగారు అందరిదగ్గరా మామూలుగానే శెలవు తీసుకున్నారు. అట్లాగే, సోమన్నతో గూడా, ''సోమన్న గారు, వెళ్ళొస్తా''. అన్నారు గంభీరంగా.

సోమన్న నిచ్చెనమెట్లు దిగుతూన్న ఆయనవంక వింతగా చూస్తూ తలవూపాడు. తర్వాత ఐదారునిమిషాలు నిశ్శబ్దంగా నిలబడి పోయినాడు. సుబ్బన్నగారి చూపులు అతనిహృదయాన్ని తీవ్రంగా కలిచివేసినట్టయింది అతనికి.

3

ఆ తర్వాతగూడా ఇతరులు ఆశ్చర్యపడేట్టుగా కొన్ని సంఘటనలు జరిగాయి. ఆటీన్ సోమన్న ఇంకెవ్వరిని లెక్క చెయ్యడు; ఇంకెవర్ను యినాసరే వాళ్లు పెద్దా చిన్నా అనే తారతమ్యం చూడకుండానే వ్యవహరిస్తాడు. మరి సుబ్బన్నగారొచ్చి '' ఏమిటి సోమన్నా!'' అని కొంచెం కళ్లెర్రచేస్తేచాలు స్తబ్దుగా నిలబడిపోతాడు!

సుబ్బన్నగారు ఎంత అతనికి! ఊరివారికీ, సోమన్న స్నేహబృందానికీ ఇది ఆశ్చర్యం కలిగించింది. సోమన్న సుబ్బన్న గారి విషయమై ఎక్కడా ఏమీ నోరుమెదపడు; సుబ్బన్నగారూ అంతే; ఎవరైనా సోమన్నగురించి ఏమైనా అంటే, ''పోనీండి రౌడీవెధవ! వాడికిదడుస్తారేమిటి!'' అని హేళనగా నవ్వి ఊరుకునేవారు.

కాని మిగతా వారిపరిస్థితులంత తేలికగా లేవు. సోమన్న పలుకుబడి అలాగేవుంది. అతనువెళ్లి అడగడం తరవాయి ఎన్నడూ ఎవరికి కానీ ఇవ్వని లుబ్ధులుగూడా పదీ పరకా మారుమాట్లాడకుండా ఇచ్చేస్తారు; చీట్లపేక సమాజాల్లోనూ అతని పలుకుబడి యథాప్రకారం సాగిపోతోంది.

ఒకనాడు సోమన్న నడి బజారులో ఒకాయనమీద కలియబడ్డాడు. పోలీసులొచ్చి విడదీశారు

ఇద్దర్నీ. సోమన్నని స్టేషన్‌కి పట్టుకుబోయారు. రెండవతను బాగా డబ్బున్న వాడు కావటంతోటి సోమన్నకి ఎలాగా ఆరునెలలయినా ఖైదు తప్పదు అని అనుకున్నారంతా.

కాని, సుబ్బన్న గారి చెవిని ఈమాట సోకగానే ఆయన స్వయంగా స్టేషన్‌కి వెళ్లి సోమన్న 'భావిసద్వర్తన' కి తాను పూచీ బడి అతనికి జైలు తప్పించి విడిపించుకువచ్చారు. ఇంతకీ పోలీసు స్టేషన్‌లో గాని, బైటకు వచ్చాకగానీ ఆ ఉభయులూ ఒక్కమాటయినా మాట్లాడుకోలేదు.

అదివరదాకా పోలీసుల్నిగూడా ధిక్కరిస్తూ - హుంకరిస్తున్న సోమన్న చప్పున చల్లబడి సుబ్బన్నగారితోటి బైటికి వచ్చేశాడు. పోలీసుస్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ గూడా ఆశ్చర్యపోయినాడు; ఏమిటిది? సుబ్బన్నగారంటే సోమన్నకి భయమా? గౌరవమా?

మరి సుబ్బన్న గారికి సోమన్న అంటే ప్రేమ ఎందుకో?

ఇన్ని ప్రశ్నలూ సోమన్న తన ఉంపుడుగత్తెను ఖూనీ చేసి పారిపోయిననాడు పోలీసులకి కలిగాయి. అందుచేతనే ఇన్స్‌పెక్టర్ గారు సుబ్బన్న గార్ని కలుసుకొని సోమన్నగా రెక్కడవుంటాడో అని అడిగి వెళ్ళాడు... 'సద్వర్తన' కు పూచీ అంతే మరి!

ఇన్స్‌పెక్టర్ సదాశివరావు గారు మర్నాడు సుబ్బన్నగారింటికి వచ్చి ''సోమన్న దొరికేవరకు మిమ్మల్ని...'' అన్నాడు. సుబ్బన్నగారు 'సరే' అని బయల్దేరారు మారుమాట్లాడకుండా. దీని అర్థమేమిటో తెలిసిన ఆయనభార్య ఇద్దరుకూతుళ్లూ లోలోపల కుమిలిపోతున్నారు. సోమన్న దొరక్కపోతే! వాడు పరమదుర్మార్గుడు; ఏమైనా చెయ్యడానికి సాహసుడు. అతనికి 'సద్వర్తన' కి ఈయన పూచీపడడమేమిటి!.... వాళ్లు దైవాన్ని ప్రార్థిస్తూవుండడం తప్ప వేరేగత్యంతరం లేకపోయింది.

ఈ సంఘటనగురించి ఊళ్లోగూడా రకరకాల ఊహలు వ్యాపించాయి. తలా ఒక మాట అనుకుంటున్నారు. '' ఇంక సోమన్న కనపడతాడురా? వొట్టిమాట'' అన్నారందరూ ఏకగ్రీవంగా.

''సుబ్బన్న గారికెందుకొచ్చింది ఆ రౌడీ వెధవతోటి? వాడెవడూ, ఈయన ఎవరూ? పరువుగా బతికేవాడల్లా ఇదొకగండం తెచ్చిపెట్టుకున్నాడు నెత్తికి'' అన్నారు సుబ్బన్న గార్ని ఎరుగున్నవాళ్లు.

అయితే సుబ్బన్న గారు మాత్రం నోరు మెదపలేదు; జైల్లో అధికార్లు ఏమేమో ప్రశ్నలు వేశారు; వేటికీన్నీ ఆయన జవాబివ్వనే లేదు.

రెండు రోజులు జరిగిపోయినాయి. సోమన్న జాడ పోలీసులకేమీ అంతుపట్టలేదు.

4

మూడో రోజు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతాల సోమన్న స్టేషన్ దగ్గిర ప్రత్యక్షమైనాడు. సరాసరి హుందాగా లోపలికి నడిచివచ్చిన అతణ్ణి చూసి ఇన్స్‌పెక్టర్ గారు చకితుడైనాడు. పక్కనే నిలబడివున్న పోలీసు తుపాకీ గురి చేసుకున్నాడు గూడా. కాని సోమన్న ''ఏం ఇన్స్‌పెక్టర్‌గారు! సుబ్బన్న గార్ని ఖైదులో పెట్టారటే, నాకు బదులు! నాకిందాక తెలిసింది. ఆయన్నొదలండి. ఇదిగో నేనొచ్చాగా!'' అన్నాడు, ధైర్యంగా రెండు చేతులూ చాచి.

ఇన్స్పెక్టర్ అతని చేతులకి 'పోలీసు కంకణాలు' తగిలించి, ''మరి నీకు ఆయన జామీన్ ఉన్నాడు గదూ?'' అన్నాడు.

''ముందు ఆయన్ని వొదలండి'' అని అరిచాడు సోమన్న ఉద్రేకంతోటి.

''మరెందుకు పారిపోయావు రెండు రోజులనించిన్నీ?'' అంటూ ఇన్స్పెక్టర్ సుబ్బన్నగార్ని వొదలటానికి కావల్సిన ఉత్తర్వులు జారీచేశాడు.

ఇంతకీ ఇన్స్పెక్టర్‌గారికి ఈ విచిత్రం అర్థం కానేలేదు. సుబ్బన్న గారిని విడిపించటంలో సోమన్న కింత ఆసక్తేమిటి?

పది నిమిషాలలో సుబ్బన్నగారు బైటికొచ్చారు. ఆయన మొహం తేటగా లేదు. తీవ్రమైన బాధతోటి ఎర్రబారి వుంది. సోమన్న ఆయన వొస్తూవుంటే తలొంచుకున్నాడు. సుబ్బన్నగారు, చెరొకవేపునా పోలీసులతోటి మధ్యని నిలబడ్డ సోమన్నని చూడగానే ఉద్రేకం పట్టలేక '' ఏం బతుకురా నీది! సోమన్నా! చివరికి ఖూనీకోరువి గూడా ఐనావు!'' అన్నారు అతనిదగ్గిరగా వొచ్చి నిలబడి.

సోమన్నని ఇంకెవరన్నా ఈ మాటలే అంటే చేతికున్న బేడీలతోటే అవతలవారిమీదబడి చంపేసివుండేవాడు. ఇప్పుడితను తల వొంచుకుని ఏమిన్నీ మాట్లాడలేదు. ఒకటిరెండు నిమిషాలైనాక చాలా మెల్లిగా, గొణుగుడుగా, ''నా బతుకే అంత! మీరిప్పుడు విచారించి లాభంలేదు'' అన్నాడు విరక్తిగా.

సుబ్బన్నగారు, ''సిగ్గులేకపోతే సరి, ఇంకా మాట్లాడుతున్నావు గాని! నోరు మూసుకో'' అని అతన్ని కసిరి, ఇన్స్పెక్టర్ వేపు తిరిగి, ''నేను వెళ్ళొస్తానండి'' అని వెళ్ళిపోయినారు. ఆయన వర్చస్సునుబట్టి ఆయన హృదయావేదన ఎంతగా ఆయన్ని వేధిస్తోందీ ఇన్స్పెక్టర్‌కి బోధపడింది.

సుబ్బన్నగారు వెళ్ళాక సోమన్నని ఇన్స్పెక్టర్‌గారు ప్రశ్నించాడు. ''సుబ్బన్నగారికీ నీకూ ఏమిటి పరిచయం!'' అని.

సోమన్న యధాప్రకారం గంభీరంగానే '' ఏమీ లేదు. సుబ్బన్న గారు సుబ్బన్న గారే; నేను నేనే. అంతకుమించి నేను చెప్పేదేమీ లేదు'' అన్నాడు.

మర్నాట్నించీ ఖూనీకేసు విచారణ ప్రారంభమైంది.

విచారణ జరిగినంత కాలమూ సుబ్బన్న గారు కోర్టుకి వస్తూనే వున్నారు. అయితే నేరం స్పష్టంగా వుండడంవల్లనూ, సోమన్న తాను 'నేరస్తుణ్ణే' అని వప్పుకోడం వల్లనూ ప్రాసిక్యూషన్ వారి పని తేలికయింది; సుబ్బన్నగారు సోమన్న తరపున ఏదైనా వాదించి ప్రయోజనం లేదని మౌనంగా వూరుకున్నారు.

తీర్పు ఇచ్చేరోజు; ఆవేళ కోర్టుకి సోమన్న స్నేహితులు చాలామంది వచ్చారు. సుబ్బన్నగారూ ఆయన భార్యా కూతుళ్ళిద్దరూ వచ్చారు. సోమన్న యధాప్రకారమే పోలీసుల మధ్య చాలా నిర్లక్ష్యంగా నిలబడివున్నాడు. సుబ్బన్నగారి మొహాన దిగులు వెళ్ళాడుతోంది స్పష్టంగా.

అందరికీ తెలుసు సోమన్నకి విధించబొయ్యే శిక్ష ఏమిటో.

జడ్జీ, ''సోమన్న ఖూనీ చేసినట్టుగా చూసిన సాక్ష్యం ఒక చత్వారపు ముసల్దీ... మేమీ కేసులో నిజాన్నిగురించి చాలా తర్కించాము. సోమన్నే వప్పుకుంటున్నాడు గదా అని ప్రాసిక్యూషన్ వారి వాదన. అంతకంటే సోమన్నను అపరాధిగా నిరూపించటానికి వేరే సాక్ష్యాధారాలేమీ లేవు; అయితే సోమన్న తాను దోషిని కానని నిరూపించుకోలేదు. కనుక నేరస్థునిగానే భావించి, సరిగ్గా నిరూపణ కాలేదు గనక, పదేళ్ల శిక్ష విధిస్తున్నాను.'' అని ముగించారు తన తీర్పు.

సోమన్నని తిరిగి తీసుకెళ్తుతూ వుంటె సుబ్బన్నగారు ఒకటి రెండు నిమిషాలు నిలబడి మాట్లాడాలని ప్రయత్నించారు; సోమన్న గూడా ఆయనవంక చూశాడు ఏమైనా మాట్లాడుదామని. చివరికి ఆయన ఏమీ మాట్లాడకపోయేవరకూ, ''నేను ఖూనీకోరుని. మీరు మర్యాదస్థులు, నాతో మాట్లాడకండి!...'' అన్నాడు. అతని కండ్లల్లో నీళ్లు నిండివున్నాయి. గొంతు తడారిపోయింది. ఎప్పుడూ తల ఎత్తుకుని గర్వంగా తిరిగే అతని తల వాలిపోయింది.

సుబ్బన్నగారికి ఈ మాటలు గుండెలకి తగిలి వేధించాయి. ఆయన అక్కడ గుమిగూడివున్న జనాన్ని సైతం మర్చిపోయి సోమన్నని అమాంతం కావిలించుకున్నారు. ''సోమన్న, నిన్నీ గతికి తెచ్చింది నేనే... తప్పు నాది... ఫలితం నువ్వు అనుభవిస్తున్నావు?'' అని గాఢమైన శోకంతోటి విలపించారు.

అక్కడ నుంచున్న వారందరినీ ఈ దృశ్యం కదిలించింది. అయితే ఎవరికీ ఏమీ అర్థమైందికాదు. సోమన్న సుబ్బన్నగారి ప్రేమపూర్వకమైన ఆలింగనంలో మైమరిచిపోయినాడు;. తరవాత అతన్ని పోలీసులు తీసుకెళ్లిపోయారు. పోతూ పోతూ సోమన్న తిరిగి చూసిన రెండు మూడు చూపులు సుబ్బన్న గార్ని మరింతగా వేధించాయి.

కొందరు మిత్రులు సుబ్బన్న గార్ని ఇంటిదాకా తీసుకొచ్చి వదిలిపెట్టారు. అందులో సుబ్బన్నగారికి బాగా స్నేహంగావున్న ఒకరు, ''సోమన్న ఎవరూ? మీకేమిటింత సానుభూతి'' అని మామూలుగా ప్రశ్నించారు.

5

మా నాన్నకి మొదటి సంబంధం కొడుకును నేను; మా అమ్మకి నేనొక్కణ్ణే. మా అమ్మ పోయాక నాన్న రెండోపెళ్లి చేసుకున్నారు. అప్పటికి నాకు పది పన్నెండేండ్లుంటాయి. మా పిన్ని మంచిది. అందరూ అనుకున్నట్టుగా ఆమె నన్ను ఏమీ బాధపెట్టేది కాదు; పైగా సొంతకొడుకును చూసినట్టు చూసుకునేది; అయితే ఆమె గర్భవతి ఐందగ్గిరనించీ పరిస్థితి మారింది; ఆమెలో మార్పుకి కారణం నాకు మొదట అగమ్యంగా వున్నా, రానురాను బోధపడింది రహస్యం.

అప్పణ్ణించి పిన్నమ్మ ప్రవర్తలోనూ మార్పువొచ్చింది. నాలోనూ చెప్పలేని ద్వేషం పెరిగింది. ఆద్వేషం, పిన్నిమీద కొంతగానూ, పిన్నికి కలిగిన శిశువుమీద మరింతగానూ రగుల్కొంది.

దీనికి దోహదమిస్తున్నట్టు నాన్నగూడా నా తమ్ముని మీద ఎక్కువగా ప్రేమాతిశయాలు ప్రదర్శించసాగారు. అది సహజం అనే ఆలోచన పన్నెండేళ్ల కుర్రవాణ్ణయిన నాకు బొత్తిగా కలగలేదు; 'పాపాయి పాపాయి' అని నాన్నా పిన్నీ 'వాడికే' అన్ని అవకాశాలూ కల్పిస్తుండేవారు. ఇదివరలో నేనడిగిందే తరవాయి అన్నీ వొచ్చేపరిస్థితి మారిపోయి, నన్నాయింట్లో పలకరించే దిక్కే లేనట్టుగా ఐపోయింది. పైగా అయిందానికీ కానిదానికి పిన్ని నన్ను దండిస్తూ వుండేది. నాలో రగులుతున్న ప్రతీకారాగ్నిని కుర్రవాడిపైన చూపించేవాడిని. అనేక తడవలు వాణ్ణి ఎవరూ లేకండా చూసి కొట్టేవాణ్ణి; గిచ్చేవాణ్ణి... మొత్తం మీద నాలో నా తమ్ముని మీద ఒక ద్వేషభావం కుర్రతనంతో పాతుకుపోయింది...

కాలం ఆగదుగదూ? కొంత కాలానికి నాన్నపోయారు; ఇంటిపెత్తనం నా కొచ్చింది. నాకు పెళ్ళయి భార్య కాపరానికొచ్చింది. పిన్ని గూడా ఒకనాడు - ఎన్నాళ్ళనించో ఆమెని వేధిస్తూవుండిన ఉబ్బసపు వ్యాధికి బలి ఐపోయింది. ఆమె చనిపోతూ పదిహేనేళ్ళ - తన కొడుకుని నాకు అప్పగించివెళ్లింది. ''నేను ఉన్నానుగా'' అన్నాను పిన్నితో. కాని ఆ చిన్నప్పటి కసి నన్నొదిలిపోలేదనే చెప్పాలి...

బాగా తల్లీదండ్రి గారాబంతో పెరిగిన నా తమ్ముడు 'తల్లీ దండ్రీ' లేనివాడు పాపం, అని ఊళ్లోవాళ్ళూ, ఇరుగూ పొరుగూ జోకొట్టటంతోటి మరింత బిగిసి నామాట ఖాతరు చేసేవాడు గాడు. ఎప్పుడూ ఊళ్లో పిల్లలతోటి పోట్లాడి వచ్చేవాడు. న్యాయం ఎవరివేపున ఉన్నా నేను మాత్రం ఎప్పుడూ నా తమ్ముణ్ణే బాదేవాణ్ణి. ఇంకో విశేషం ఏమంటే, వాడు ఎంత నామాట ఖాతరు చెయ్యకపోయినా, నేను గనక కన్నెర్రచేస్తే సరి, నోరెత్తేవాడు గాదు. నేనంటే లోపల ఏమనుకునేవాడో ఏమోగాని పైకి చాలా గౌరవం చూపేవాడు.

''నా భార్య అతన్ని ప్రేమగా చూసేది. చాలా తడవలు వాణ్ణి సహించలేక ''వీడికి కూడుపెట్టకు'' అని నేను ఆజ్ఞపెట్టినా వినక దొంగతనంగా అన్నం పెట్టేది.

వాడికి పెళ్ళీడు వొచ్చింది. వాడి భాగం వాడికి పంచి ఇచ్చిపెళ్ళిచేసి పంపిస్తే సరిపోతుందని మా కుటుంబానికి చెందిన పెద్దలు నాకు సూచిస్తూవచ్చారు. కాని నా పరిస్థితి తలకిందులుగా వుంది. నాన్నగారు మా ఉభయులకీ ఉంచిన ఆస్తిలో కొంత భాగం నేను దుర్వ్యసనాలకింద వ్యయపరిచివున్నాను; ఇప్పుడు నా తమ్ముడికి నేను గనక ఆస్తిపంచాల్సివొస్తే - నాకు మిగిలేది స్వల్పం... నాలో ఆదినుండీ తమ్ముడంటే వున్న ద్వేషం తిరిగి వొకసారి ప్రబలింది. ఇప్పుడెలాగైనా వాడికి ఈ ఆస్తి పంచివ్వకుండా చేయగలిగితే... అని నేను ఆలోచించసాగాను.

దీనికి తగ్గట్టే వొకనాడు, నా తమ్ముడు, ఊళ్లో ఉన్న మంచినీటి బావిదగ్గిర ఒక అమ్మాయిని ఏదో అన్నాడని వాళ్ళ వాళ్ళు వొచ్చి గోలచేశారు నా ఇంటిముందు. ఆ రాత్రి వాడు, భయపడుతూనే నేను నిద్రపోయివుంటానని భావించి ఆలస్యంగానే వొచ్చాడు ఇంటికి. నేను వాడే వేళకొచ్చినా రానీ, ఇవ్వాళ అటో ఇటో తేల్చుకోవాలని కూర్చునివున్నాను.

వాడు లోపలికి రావటంతోటి '' ఏరా, ఏం రానురాను ముదిరిపోతోంది వ్యవహారం! నేనేమైనా మర్యాదగా తలెత్తుకుని నలుగుర్లో తిరగాల్నా అక్కర్లేదా!'' అన్నాను కోపంతోటి మండిపోతూ. వాడేమీ

నోరెత్తలేదు; వాడికీ ఇర్వై ఏళ్లున్నాయని అయినా ఆలోచించక నోటికొచ్చినట్టు దుర్భాషలాడాను; ఆ పక్కనే ఉన్న వసికర్ర తీసుకుని గొడ్డును బాదినట్టు బాదాను. నా భార్య అడ్డం వస్తే దాన్నీ బాదాను.

'ఆవేళ వాడు, వొచ్చే ఏడ్పును బలవంతంగా అణచుకున్నాడు. ఆగ్రహాన్ని తమాయించుకున్నాడు. నేను తప్ప, వాడు మావూళ్లో ఇంకెవరికీ తలవొగ్గే రకం కాదు. చివరికి వాడు కళ్లెర్ర బారి, మొహం సిగ్గుతోటి చిన్నబుచ్చుకుని, ''నేనీ యింట్లో వుండడానికి అనర్హుణ్ణి అన్నయ్యా... వెళ్తాను'' అంటూ, నా భార్య ఎంత బతిమాలినా వినిపించుకోకుండానే వెళ్ళిపోయాడా చీకటి రాత్రిలోనే....

''పోతే పోయాడు వెధవ! నన్ను పరువుగా బతకనీయకండా వున్నాడు!'' అనేసి వూరుకున్నాను నేను. నా ఉద్దేశం వాడు త్వరలోనే తిరిగి వస్తాడని... ఈపైపై ఊహలకి అట్టడుగున 'రాకపోతే' బాగుండునే అనిపించింది...

ఆ నెల చూశాను... నెల సంవత్సరమైంది... అనేక ఇతర కారణాలవల్ల నేను శ్రీకాకుళం వొదిలి పెట్టి, రాజమండ్రి వొచ్చేశాను... పదేళ్ళయింది. నా ఆస్తి కరిగిపోవడం ఒక కారణం... నా తమ్ముడు భాగం అలా నేవుంది... దానిమీద వొచ్చే రాబడితోటి కాలం గడుపుతున్నాను... చీట్లపేక గూడా కొంత ఆదాయాన్నిస్తూ వుండేది...

'' ఆవేళ, ఆర్యాపురంలో పదేళ్ల తరవాత సోమన్నని చూశాను... చీట్లపేక ఆడుతూంటే...

''వాడు బాగా పెరిగి నా అంతవాడై వున్నాడు! ఆటీన్ సోమన్న అంటే నాకూ యథార్థంగా ఎవరో తెలియదు అంత క్రితం. నా తమ్ముడు సోమన్నే, ఆటీన్ సోమన్న అని తెలుసుకున్నాక ఏమీ తోచలేదు. అయితే ఆవేళ వాడు, ఇంకోడితో ఘర్షణపడితే నేను విడదీశాను... వాడూ నన్ను పోల్చుకున్నాడు. ఉభయులం అన్నదమ్ములము బైటపడడానికి కొంచెం జంకాము. ఏమిటో! ఆటీన్ సోమన్న అంటే ఊళ్లో రౌడీ - దొంగ అనిగదా ప్రసిద్ధి! వాణ్ణి నా తమ్ముడని చెప్పుకోడం నాకంతగా ఇష్టం లేకపోయింది. పరాయివాణ్ణి పలకరించినట్టే పలకరించి వచ్చేశాను. నేను 'తమ్ముడూ!' అనలేదనే ఆవేదన వాడి మొహంలో కనిపించింది అప్పుడే.

ఆవేళ రాత్రి సోమన్న నా యింటికి వచ్చాడు. నాకు ఆస్తి దిగులు పట్టుకుంది. ఈ సుఖజీవనానికి భంగం వస్తుంది... అంతేగాదు, నా కూతుళ్లిద్దరికి పెళ్లిళ్లు చెయ్యాలి.

సోమన్న, నా భార్యతోటి మాట్లాడాడు. నా కూతుళ్లిద్దరూ 'బాబాయి బాబాయి' అని వాడిచుట్టూ తిరిగారు. నాకేమో ఎవరేనా చూస్తారేమో! ''ఆటీన్ సోమన్న సుబ్బన్నగారి తమ్ముడా!'' అని నిరసనగా మాట్లాడుతారేమో అని భయం.

చివరికి సోమన్నా, నువ్విక్కడికి రావటం తగదు... నేనెంతో పరువుగా పెద్దమనిషిగా బతుకుతున్నాను'' అన్నాను. అప్పుడుగూడా 'తమ్ముడూ' అనలేకపోయాను. నాకు చిన్నప్పణ్ణించీ వాడు తమ్ముడన్న భావన లేదు... ఏదో శత్రుత్వం!

సోమన్న ''రానులే అన్నయ్యా! నాకు తెలుసు మర్యాద, పరువూ అంటే ఏమిటో!'' అనేసి

వెళ్లిపోయినాడు. వాడు వెళ్లాక నా భార్య నాతోటి పోట్లాడింది వాణ్ణి అలా అన్నందుకు. ఆమె నోరు మూయించాను...

ఒకనాడు వాణ్ణిపోలీసులు పట్టుకుపోతే 'పూచీకత్తు' రాసిచ్చి విడిపించాను. నాభార్య వత్తిడిమీదనే. బైటికి వచ్చాక ''మీ కెందుకు ఇంత శ్రమ ''సుబ్బన్నగారు!'' అని అడిగాడు అవహేళనగా. వాడు నన్ను 'సుబ్బన్నగారూ!' అని సంబోధించేటప్పటికి నా హృదయాన్నెవరో రంపం పెట్టి కోస్తున్నట్టుంది... అయినా మెదలకండా వూరుకున్నాను.

తరవాత సంగతి మీకు తెలిసేవుంది... సోమన్న ఇందాక కళ్ల నీళ్లు పెట్టి, ''మీరు మర్యాదస్థులు - నాతో మాట్లాడకండి'' అన్నాడు.

నాకు ఆత్మహత్య చేసుకుందామన్నంత విరక్తి పుట్టింది. లోకంలో మర్యాదకోసమూ, పరువుకోసమూ, ధనంకోసమూ నేను, నా నిజమైన శ్రేయస్సు కోరే 'తమ్ముణ్ణి' చేతులారా పోగొట్టుకున్నాను. వాడు హత్య జరగటానికి ముందు రాత్రి నా యింటికి వొచ్చాడు.

వాడి వొదినతో మాట్లాడుతూ కాసేపున్నాడు. ''వొదినా, అమ్మాయిలకి పెళ్ళెప్పుడు చేస్తారు?'' అని అడిగాడు గావును. నా భార్య. '' ఎలాగతెములుతుందో నాయనా, మీ అన్నయ్య ఏమి పట్టించుకోరు. ఆయన భాగం ఆస్తి అంతా అమ్మేసుకున్నారు. ప్రస్తుతం నీ భాగం ఆస్తిమీద వొచ్చే ఆదాయంతోటి, జీవిస్తున్నాం...'' అన్నది ... ఆమెకి మనఃపూర్వంగా నా తమ్ముడి ఆస్తివాడికిచ్చెయ్యాలనే ... వుంది!

నేను నా గదిలో పడకకుర్చీలో పడుకుని ఈ సంభాషణంతా మౌనంగా వింటున్నాను. వాడేమంటాడో! 'నా ఆస్తి నాకు పంచి ఇవ్వండి...' అంటే తప్పేదేమీ లేదు. కనీసం పరువు ప్రతిష్ఠలకి దడిసి ఐనా ఇచ్చేస్తాను కదా! ప్రేమ లేకపోయినా గాని!

''అదేమిటి వొదినా, అన్నయ్య భాగం ఏమిటి, నా భాగం ఏమిటి! ఉన్న ఆస్తి అంతా మనది. అందులో కొంత అమ్మేసి, అమ్మాయిల పెళ్ళి చెయ్యమను అన్నయ్యని. దీనికి నన్ను అడగాలా!'' అన్నాడు నిజమైన ఔదార్యం స్ఫురించే స్వరంతోటి.

అటువంటి తమ్ముణ్ణి పోగొట్టుకున్నాను... ఇప్పుడు తెలుస్తోంది, వాడి విలువ. నేను గనక వాణ్ణి చిన్నప్పుడే ప్రేమించి, సంస్కరించి వున్నట్టయితే వాడు ఇలా రౌడీగా తయారుగాకపోను... చివరికి హంతకుడైనాడు గదా! ఆ తప్పంతా నాది!...

సుబ్బన్నగారు ఆపైన ఏమీ మాట్లాడకుండా కూర్చుండి పోయారు. పశ్చాత్తాపంతోటి ఆయన కళ్ళల్లో నీళ్లు నిండాయి. మిత్రులు ఆయన్ని వోదార్చి ఎవరిళ్ళకి వాళ్లు వెళ్ళారు, ఈ కథకి ఆశ్చర్యపడుతూ.

*(1955 - 56, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక)*